
97 స్టార్టప్‌లతో కర్ణాటక ముందంజ

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 97 స్టార్టప్‌లతో కర్ణాటక వెబ్3 విభాగంలో దేశంలోనే ముందంజలో నిలిచినట్లు భారత్ వెబ్స్ అసోసియేషన్ సోమవారం ప్రకటించింది. బెంగళూరు, ముంబై, ఢిల్లీ నగరాలను దేశంలోనే మూడు టాప్ నగరాలుగా నిర్ధారించారు. 400కుపైగా ఇన్నోవేటర్‌లు వెబ్ 3 డిజిటల్ ల్యాండ్‌స్కేప్‌ను రూపొందించారు. అందులో 97 కంపెనీలు బెంగళూరులో ప్రధాన కార్యాలయాలు కలిగి ఉన్నాయి. కర్ణాటక 97 స్టార్టప్‌లతో జాతీయస్థాయిలో 33శాతం కలిగి ఉందని పేర్కొన్నారు. మహారాష్ట్ర 47 కంపెనీలు, తెలంగాణ 20, హర్యానా 19, ఉత్తరప్రదేశ్ 16 కంపెనీలు ఉన్నట్లు తెలిపారు.



బెంగళూరు - పూణే మధ్య

12 లైన్ల హైవే

- రెండు ఐటీ నగరాల మధ్య ఏడు గంటల్లోనే ప్రయాణం
- భారత్‌మాల రెండో విడతలో అమలుకు కసరత్తు
- సిద్ధమైన డీపీఆర్.. వ్యాపార లావాదేవీలు మరింత జోరు

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఐటీ రాజధాని బెంగళూరుకు మరో భారీ రహదారి ప్రాజెక్టు రానుంది. కేంద్రప్రభుత్వ భూ ఉపరితల రవాణాశాఖ దశాబ్దాలకాలంగా నాలుగు లైన్, ఆరు లైన్ల రహదారులను నిర్మించింది. ఇటీవల కొన్నేళ్లుగా అష్టపథ (8లేన్), దశపథ (10 లేన్) రహదారులను ప్రధాన నగరాలకు అనుసంధానం చేస్తూ విస్తరించింది. దేశంలో ద్వాదశ పథ (12 లైన్)ల ఎక్స్‌ప్రెస్ హైవే ఢిల్లీ - ముంబైల మధ్య ఏర్పాటు చేశారు. దక్షిణభారత్‌లో ఇటువంటి 12 లైన్ల రహదారి విస్తరణ బెంగళూరు - హైదరాబాద్‌ల మధ్య నిర్మించేందుకు నేషనల్ హైవేస్ అథారిటీ సిద్ధమవుతోంది. బెంగళూరు - హైదరాబాద్‌ల మధ్య 12 లైన్ల రహదారి నిర్మిస్తే బెంగళూరు ఉత్తర, చిక్కబళ్ళాపుర ప్రాంతాల్లో ఆర్థిక వ్యవహారాలు అభివృద్ధి చేసుకోవాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది.

డీపీఆర్ సిద్ధం

భారత్‌మాలా రెండో విడత ప్రాజెక్టులో బెంగళూరు - పూనెల మధ్య 12 లైన్ల రహదారి ప్రాజెక్టును చేపట్టదలిచారు. 699 కిలోమీటర్ల దూరం ఉండే రెండు నగరాల మధ్య గంటకు 120 కిలోమీటర్ల వేగంతో సంచరించేలా ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కానుంది. ప్రస్తుతానికి దేశంలో రెండు ప్రధాన నగరాల మధ్య జనసంచారానికి అనుకూలంగా ఉండాలని ఎక్స్‌ప్రెస్ హైవేలు నిర్మిస్తున్నారు. బెంగళూరు - పూనెల మధ్య 12 లైన్ల రహదారి అందుబాటులోకి వస్తే దేశంలోని రెండు ప్రధాన ఐటీ నగరాలమధ్య హైవే ఏర్పాటు చేసినట్లు అవుతుంది. ప్రస్తుతం 700 కిమీ ప్రయాణం 15గంటలు పడుతుండగా ఎక్స్‌ప్రెస్‌హైవే పూర్తయితే 7గంటలకే చేరుకునే అవకాశం ఉంది. బెంగళూరు - పూనెల మధ్య ప్రస్తుతం ఉన్న 8 లైన్ల రహదారిపై ట్రాఫిక్ విపరీతంగా పెరుగుతోంది. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రెండు నగరాలలో ఐటీ, రియల్ ఎస్టేట్, ఇతరత్రా పరిశ్రమల వ్యవహారాలతోపాటు ఆర్థిక లావాదేవీలు పెరగనున్నట్లు కేంద్రప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుత ప్రాథమిక అంచనాల ప్రకారం 40వేల కోట్ల రూపాయలు ప్రాజెక్టుకు అవసరంగా ప్రతిపాదించారు. నిర్మాణానికి సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) సిద్ధమైంది. నేషనల్ హైవే అథారిటీ భూస్వాధీన కమిటీ సదరు ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. పూనె నగరంలో ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 12 లైన్ల రహదారి ప్రారంభమై బెంగళూరు నగర శివారులోని సబర్బన్ రింగ్‌రోడ్డు ముత్తుగదహళ్ళితో ముగియనుంది. బెళగావి జిల్లా అథణి తాలూకా బొమ్మనాళ నుంచి హైవే కర్ణాటకలో ప్రవేశించనుంది. మహారాష్ట్ర పరిధిలో పూనె నుంచి సతారా, సాంగ్లిల మీదుగా బెళగావికి చేరుకోగా బాగల్కోటె, గదగ్, కొప్పళ, విజయనగర, దావణగెరె, చిత్రదుర్గ, తుమకూరు, బెంగళూరు గ్రామీణ జిల్లాల మీదుగా రానుంది.

699 కిలోమీటర్లు

- ఆరు నదులపై వంతెనలు

699 కిలోమీటర్ల పొడవున నిర్మించే ఈ ఎక్స్‌ప్రెస్ హైవేలో మహారాష్ట్ర పరిధిలో 201 కిలోమీటర్లు, కర్ణాటక పరిధిలో 498 కిలోమీటర్లు నిర్మాణం జరగాల్సి ఉంటుంది. రెండు రాష్ట్రాల మధ్య ఆరు నదులపై భారీ వంతెనలు నిర్మించాల్సి ఉంటుంది. మహారాష్ట్రలో నీరా, ఎరేరా నదులు కర్ణాటక పరిధిలో కృష్ణ, ఘటప్రభ, మలప్రభ, బెణ్ణెహళ్ళ, తుంగభద్ర, జోణిహళ్ళ, వేదవది నదులపై ఆరు వంతెనలు నిర్మించేలా డీపీఆర్‌లో ఉంది. ప్రాజెక్టు కారణంగా బెళగావి జిల్లాలో 15, బాగల్కోటె జిల్లాలో 57, గదగ్, కొప్పళ జిల్లాల్లో చెరో 21, విజయనగర జిల్లాలో 44, చిత్రదుర్గ జిల్లాలో 3, తుమకూరు జిల్లాలో 41, బెంగళూరు గ్రామీణ జిల్లాలో 10 గ్రామాలకు నష్టం చేకూరనుంది.

రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి..

12 లైన్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమౌతోంది. మాళవీయ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ సలహా సంస్థ అక్టోబరు 27న పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ రూపంలో ప్రభుత్వానికి సమాచారం ఇచ్చినట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. 12 లైన్ల రహదారి నిర్మాణం ద్వారా సురక్షితతో వేగాన్ని పెంచేందుకు వీలుంటుంది. అటవీప్రదేశం, నదులు, జనావాస ప్రాంతాల్లో సామాజిక పరిణామం తగ్గించడం, పర్యావరణ వ్యవస్థకు ఆటంకం కలగకుండా ఉండేలా ప్రాజెక్టు డీపీఆర్‌ను సిద్ధం చేసినట్టు సంస్థ వివరించింది.

మరో 12 లైన్ల రహదారి

బెంగళూరు, హైదరాబాద్ రహదారిపై చర్చలు సాగుతుండగానే రాష్ట్రానికి మరో 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి కేంద్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బెంగళూరు - పూనెల మధ్య ఎన్‌హెచ్4ను ఎక్స్‌ప్రెస్ గ్రీన్ ఫీల్డ్ రహదారిగా ఆధునికీకరించే ప్రస్తావనలు సిద్ధం చేశారు.

భూస్వాధీన వివరాలు

జిల్లా	పొడవు (కిమీ)	విస్తీర్ణం (హెక్టారు)
బెళగావి	47.1	471
బాగల్కోటె	92.1	921
గదగ్	49.2	492
కొప్పళ	48.1	481
విజయనగర	82.2	822
దావణగెరె	3.3	33
చిత్రదుర్గ	72.9	729
బెం.గ్రామీణ	7.1	71
అదనంగా	250	
మొత్తం	498	5,248



విశ్వమానవుడు కనకదాస

- ఆయన తత్వాలు నేటికీ ఆచరణీయం: జయంతి వేడుకల్లో సీఎం

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కనకదాస సాధువు మాత్రమే కాదని సమాజ సాధకుడిగా విశ్వమానవుడు అనిపించుకున్నారని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. ఆయన వ్యాఖ్యలు నేటికీ ఆచరనీయమన్నారు. కనకదాస జయంతిని పురస్కరించుకుని సోమవారం శాసకర భవన్ ప్రాంగణంలో కనకదాస విగ్రహానికి పూలమాల సమర్పించారు. మంత్రులు మహదేవప్ప, శివరాజ్ తంగడిగ, ప్రియాంక ఖర్గే, చీఫ్ సెక్రటరీ శాలినీ రజనీశ్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం రవీంద్ర కళాక్షేత్రలో ఏర్పాటైన కార్యక్రమంలో కనకదాస జయంతి వేడుకలను ప్రారంభించారు. సమాజంలో సాధకులకు 'కనకశ్రీ' పురస్కారాలను ప్రదానం చేశారు. కనక తత్వపదాల 18 సంపుటాలను జాతికి అంకితం చేశారు. తింథణి కనకగురుపీఠం జగద్గురు సిద్దరామానంద స్వామీజీతోపాటు మంత్రులు పాల్గొన్నారు.

9నుంచి శీతాకాల సమావేశాలు

- బెళగావిలో సిద్ధమైన సువర్ణసౌధ



బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శాసనసభ శీతాకాల సమావేశాలు డిసెంబరు 9 నుంచి 20వరకు బెళగావి సువర్ణసౌధలో నిర్వహించనున్నారు. శాసనసభ సమావేశాలకు సంబంధించి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌కు సమాచారం పంపినట్లు శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ వెల్లడించారు. నగరంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సువర్ణసౌధను ఇటీవలే శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి సందర్శించారు. సమావేశాలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారన్నారు. 1924 డిసెంబరు 26, 27 తేదీల్లో 39వ కాంగ్రెస్ పార్టీ సమావేశం బెళగావిలో జరిగాయన్నారు. బెళగావిలో కాంగ్రెస్‌కు వందేళ్ల పూర్తి అవుతున్న సందర్భంగా డిసెంబరు 26, 27 తేదీల్లో కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది.



బళ్లారిలో దీపాలు వెలిగిస్తున్న యువతులు

మార్మోగిన ఓం కారం..!

కార్తీక సోమవారం సందర్భంగా శివ నామస్మరణ మార్మోగింది. భక్తులు ఆలయాల్లో దీపాలు వెలిగించి పూజలు నిర్వహించుకున్నారు. 8

రైలులో రూ.63 లక్షల బంగారం చోరీ

బెంగళూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముంబై నుంచి ఉడుపికి రైలులో ప్రయాణించిన ఓ కుటుంబానికి చెందిన రూ.63లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ముంబై నివాసి అవినాశ్ ఈమేరకు మణిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 15న కుటుంబ సభ్యులతో కలసి ముంబై నుంచి సీఎస్‌టీ మంగళూరు ఎక్స్‌ప్రెస్‌లో ఎస్3 కోచ్‌లో ప్రయాణించారు. నాలుగు సూట్‌కేసులలో దుస్తులు, బంగారు ఆభరణాలతో వచ్చామన్నారు. 16న ఇంద్రాణి రైల్వేస్టేషన్‌లో దిగి ఇంటికెళ్లి పరిశీలిస్తే బంగారు ఆభరణాలు కనిపించలేదని ఫిర్యాదు చేశారు. పన్వేల్ - కంకావ్లి రైల్వేస్టేషన్‌లమధ్య చోరీ జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం మణిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 303 కింద కేసు నమోదు చేశారు. 900 గ్రాముల ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఎమ్మెల్యేలను పంపింది సిద్దరామయ్యే

- నాటి కూటమి ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నారు
- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి



జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నింది సిద్దరామయ్యనే అని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీలోకి పంపింది ఆయనే అని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆరోపించారు. 7



కేంద్రమంత్రి సోమణ్ణతో సీఎం సిద్దరామయ్య మాటామంతీ

నా మాట వినకపోతివే..!

- అందుకే ఇన్ని తిప్పలు..
- ముడా స్థలాలు వాపసు ఇవ్వమని చెప్పా..
- సీఎంతో కేంద్రమంత్రి సోమణ్ణ చలోక్తులు

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ముడా సైట్‌లు వాపసు ఇవ్వమని అప్పుడే చెప్పలేదా... నా మాట విని ఉంటే ఎంతో బాగుండేదని ఈ కేసుల వివాదం ఏంటంటూ సీఎం సిద్దరామయ్యతో కేంద్రమంత్రి సోమణ్ణ ప్రస్తావించారు. సోమవారం రమణశ్రీ హోటల్‌లో జరిగిన అఖిల భారత శరణసాహిత్య పరిషత్ సభకు సీఎం వస్తుండగా అప్పుడే కేంద్రమంత్రి సోమణ్ణ బయటకు వచ్చారు. ఎదురుపడ్డ సీఎం సిద్దరామయ్యతో కరచాలనం చేసి ముడా సైట్‌ల విషయం ప్రస్తావించారు. చిన్న విషయం ఎంతదాకా వెళ్లిందో... అంటూ వ్యాఖ్యానించారు. రూ.70కోట్లు ధర పలుకుతుందని ఎందుకు చెప్పావన్నారు. 'ఏయ్... నువ్వారు కోప్పు... నా మాట విను... అన్నీ అబద్ధాలు చెబుతున్నారు. భూ ఆక్రమణల చట్టం తెలియకుండా మాట్లాడొద్దు...' అంటూ సిద్దరామయ్య బదులిచ్చారు. ఇద్దరూ నవ్వుకుంటూ గడిపారు.



దేవసముద్రం వద్ద నేలకొరిగిన వరి పంట

కష్టాల ఖరీఫ్..!

- అన్నదాతను ముంచిన వర్షాలు
- చేతికొచ్చిన పంట నీటి పాలు.. నేలకొరిగిన వరి

కంప్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈఏడు ఖరీఫ్ అన్నదాతకు కష్టాలనే మిగిల్చింది. ఓ వైపు అధిక వర్షాలు, ధరల పతనంతో రైతుకు కన్నీరే మిగిలింది. పంట చేతికొచ్చే వేళ వరుస తుఫాన్లు రైతు కొంప ముంచాయి. వరి పంట నేలకొరిగి నష్టాలనే మిగిల్చింది. కంప్లి, కురుగోడు, సిరుగుప్ప, బళ్లారి రూరల్, సండూరు తదితర తాలుకాల్లో ఆర్ఎన్ఆర్, సోనా, గంగాకావేరి, బీటీటీ 5204 తదితర రకాల వరి రకాలను విస్తృతంగా సాగుచేశారు. తుంగభద్ర జలాశయం కింద ఈ సారి హెచ్చెల్సీ, ఎల్ఎల్సీ భాగాల్లో లక్షల హెక్టార్లలో వరి సాగు చేశారు. వేదవతి హగరి నది ఎత్తిపోతల పథకం బోర్ల ద్వారా బోరుబావుల కింద కూడా పంట వేసుకున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టినా చేతికొచ్చే వేళ పంట నీట మునిగింది. ఇదే గాక పత్తి, మిరప, మొక్కజొన్న, సజ్జ, ఇతర పంటలు వేసుకున్న రైతులు తెగుళ్లతో పూర్తిగా ఇబ్బందులకు గురవుతున్నారు. పెట్టుబడులు కూడా చేతికందవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు.

నీరున్నా సంతోషం లేదు: హనుమంతరెడ్డి, రైతు



ఈ ఏడాది తుంగభద్ర జలాశయంలో 19వ క్రస్ట్ గేటు కొట్టుపోయిందని ఆందోళన చెందాం. కానీ నిపుణులు త్వరగా గేటు ఏర్పాటు చేసి నీటిని కాపాడినా ఆ సంతోషం అల్పపీడన ప్రభావంతోనే పోయిందన్నారు. ఎకరాకు సుమారు రూ. 30 వేలు నుంచి రూ. 40 వేల వరకు పెట్టుబడులు పెట్టాము. ఇప్పుడు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

నిండా మునిగిపోయాం: మంజునాథ, బైరాపుర



అకాల వర్షాల వల్ల పూర్తిగా పంటలు దెబ్బతిని పంటల పైనే మొలకలు వచ్చాయి. ఈ ఏడాది ఎకరాకు 45 నుంచి 50 బస్తాల దిగుబడి వస్తుందనుకున్నాం. కానీ అధిక వర్షాలతో గింజలు నేలరాలి కనీసం 25 బస్తాలైనా వస్తాయో లేదో అనే అనుమానం ఉంది.

ప్రభుత్వం ఆదుకోవాలి : గోవిందప్ప, రైతు నాయకులు



సుమారు నాలుగు తాలుకాల్లోను అధిక వర్షంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. వారిని ప్రభుత్వం రెవెన్యూ శాఖ ద్వారా సర్వే చేయించి నష్టపరిహారం కల్పించి ఆదుకోవాలి. రైతులను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమవుతాయి. ఇప్పటికే కొందరు కౌలు రైతులు పంటలు నష్టపోయి దిగులుతో గడుపుతున్నారన్నారు. పండిన కాస్త పంటలకైనా గిట్టుబాటు ధర కల్పించాలి. మద్దతు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోకపోతే అన్నదాతకు బతుకు కష్టమే.



భూం..ఢాం..!

- పడిపోయిన రియల్ వ్యాపారం
- అమ్ముడు పోని ప్లాట్లు.. కానరాని క్రయవిక్రయాలు
- తగ్గిపోయిన రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం

బళ్లారి, నవబంరు 18(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మూడు పూవులు, ఆరుకాయలుగా సాగిన రియల్ వ్యాపారం ఇటీవల భారీగా పడిపోయింది. రియల్ వ్యాపారానికి విజయనగర, బళ్లారి జిల్లాలు పెట్టింది పేరు. మైనింగ్ ప్రాంతం, పైగా తుంగభద్ర ఆయకట్టు ఓ వైపు, ఒవ్యాపార లావాదేవీలు మరో వైపు. ఇలా అన్నీ కలిసి రూ.కోట్లలో సాగిన లావాదేవీలు నేడు బొక్కబోర్లా పడింది. మైనింగ్ కార్యకలాపాలు స్తంభించడం, బళ్లారి నుంచి కొత్తగా విజయనగర జిల్లా ఏర్పడం వల్ల ఇంటి స్థలాలు, భూములు, ఇళ్ల క్రయ విక్రయాలు బాగా తగ్గిపోయాయి. రియల్ వ్యాపారం పడిపోవడంతో అటు వ్యాపారులకే కాక రిజిస్ట్రేషన్లు లేక ప్రభుత్వానికీ ఆధాయం పడిపోయింది. బళ్లారి నగర పరిధిలో ఒకప్పుడు చదరం రూ.2 నుంచి రూ.3 వేలు పలికిన ధరలు నేడు వెయ్యి లోపలే ఉన్నట్లు సమాచారం. ఒకప్పుడు బెంగళూరును తలదన్నిన ధరలు బళ్లారిలో పలికాయి. దీంతో చాలా మంది రియల్ వ్యాపారంలోకి అడుగు పెట్టారు. నగరం చుట్టూ ఉండే పొలాలను రూ. కోట్లు పెట్టి కొని వెంచర్లు వేశారు. అందులో రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు, అందమైన పూల అమరికకు రూ.లక్షలు ఖర్చు చేశారు. అంతక ముందు బాగా ప్లాటు అమ్ముడు పోయాయి. కానీ గత ఏడాది నుంచి రియల్ వ్యాపారం భారీగా పడిపోయింది. వెంచర్‌లో వంద ప్లాట్లు వేస్తే ఏదో రెండు మూడు ప్లాట్లు అమ్ముడు పోవడం. మిగిలిన ప్లాట్లు కొనేందుకు ఎవరూ ముందుకు రాకుండా పోవడంతో రియల్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ప్లాట్లు రేటు ముందు కన్నా ఇప్పుడు బాగా తగ్గించినా అమ్మకాలు జరగం లేదు, ఒకప్పుడు చదరం రూ. 2 ఉండే రేటును ప్రస్తుతం రూ. 1500 అంతకన్నా తక్కువ రూ. 1000 కి తగ్గించినా కొనుగోళ్లు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. బళ్లారి, విజయనగర జిల్లాల పరిదిలో వందల సంఖ్యలో వెంచర్లు వెలిసాయి. వీటిలో ఎక్కువ శాతం అమ్ముడు పోక అలాగే మిగిలిపోయాయి. కొందరు వ్యాపారులు ప్లాట్లు అమ్ముడుపోక మళ్లీ వ్యవసాయానికే సిద్ధమవుతున్నారు. బళ్లారి నగరం చుట్టూ దాదాపు 7 నుండి 10 కిలో మీటర్ల వ్యాప్తిలో వెంచర్లు వెలిసాయి. ఇందులో చాలా వెంచర్లలో ప్లాట్లు అమ్ముడు పోక రియల్ వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. బళ్లారిలో మైనింగ్ కార్యకలాపాలు పూర్తిగా తగ్గిపోవడం, జిల్లా విభజనే కారణమని వ్యాపారులు అంటున్నారు. మళ్లీ రియల్ వ్యాపారం ఎప్పుడు ఊపందు కుంటుందోనని ఎదురు చూస్తున్నట్లు పేర్కొంటున్నారు.

జైలులో అవ్వ

కలబురగి సెంట్రల్ జైలులో వృద్ధురాలు

93 ఏళ్ల వయసులో.. వరకట్నం శిక్ష

సుప్రీం కోర్టులో పిటిషన్ వేయాలని ఉప లోకాయుక్త సూచన



బెంగళూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరకట్నం కేసులో 93ఏళ్ల వృద్ధురాలు జైలులో శిక్ష అనుభవిస్తుండడాన్ని గమనించిన ఉప లోకాయుక్త స్పందించింది. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. కలబురగి జిల్లా పర్యటనలో ఉన్న ఉపలోకాయుక్త శివప్ప శనివారం స్థానిక సెంట్రల్‌జైలును సందర్శించారు. ఖైదీలతో అక్కడి వసతులు, ఇతరత్రా అంశాలపై ఆరా తీశారు. ఇదే సమయంలో ఓ అవ్వకు తోటి ఖైదీలు సేవలు చేస్తుండడాన్ని గమనించారు. నేరుగా ఆమె వద్దకు వెళ్లి వివరాలు ఆరా తీశారు. 93ఏళ్ల నాగమ్మకు వరకట్నం కేసులో మూడేళ్ల జైలుశిక్ష పడినట్లు జైలు అధికారులు అధికారులు తెలిపారు. వయోభారం కారణంగా ఆమె ఎటువంటి పనులు చేసుకోలేదని, తోటి ఖైదీలు సహకరిస్తున్నారని జైలు సూపరింటెండెంట్ అనిత వివరించారు. నాగమ్మకు సంబంధించిన మెడికల్ రిపోర్ట్ సిద్ధం చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ శశిధర్‌శెట్టికి ఫోన్ చేసి నాగమ్మ కేసు వివరాలు తెలిపారు. జిల్లా న్యాయసేవల ప్రాధికార సభ్యుడు శ్రీనివాస్ నవలెకు పిటీషన్ దాఖలుకు కోరారు. జైలులో వంటగదితోపాటు ఖైదీలు ఉండే ప్రదేశాన్ని పరిశీలించారు. ఓ ఖైదీ పదేళ్ల జైలుశిక్షకు గురయ్యానని, ఒకసారి కూడా పెరోల్ ఇవ్వలేదని వాపోయారు. అయితే ఇదే జైలులో పెరోల్‌పై బయటకు వెళ్లినవారు తప్పించుకుని కొన్ని నెలల తర్వాత పట్టుబడిన అంశాన్ని సూపరింటెండెంట్ గుర్తు చేశారు. పదేళ్ల జైలులో ఉంటే పెరోల్ వెసలుబాటు కల్పించవచ్చునని ఉపలోకాయుక్త సూచించారు. కలబురగి పోలీస్ కమిషనర్ డాక్టర్ శరణప్ప, ఎస్పీ అడ్డూరు శ్రీనివాసులు, లోకాయుక్త ఎస్పీ బీకే ఉమేశ్, డీసీపీ కన్నికా సెక్రివాల్‌లు ఉన్నారు.

న్యూస్ బాక్స్

చట్టాలపై అవగాహన ఉండాలి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్



మాట్లాడుతున్న శివప్రసాద్ యాదవ్

అనంతపురం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన కలి గి ఉంటే సమస్యలను పరిష్కరించుకోవడం సులభమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్ అన్నారు. సోమవారం న్యాయసేవాసదన్ హాల్‌లో అసంఘటిత కార్మికులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ఏ అధికారి లేదా యజమాని నుంచైనా ఇబ్బందులు ఎదురైతే చట్టపరిధిలో పరిష్కరించుకోవడానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చన్నారు. అసంఘటిత కార్మికులకు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు సుజాత, ప్రతాప్‌నాయుడు, న్యాయవాది హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి సోమవారం తెలిపారు. ఇన్‌స్టాలేషన్ ఆఫ్ స్మార్ట్ మీటర్స్ ఉద్యోగాల కోసం 20న కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తిగల విద్యార్థులు హాజరు కావాలని కోరారు. పదో తరగతి, ఐటీఐ మార్కుల జాబితాలతో పాటు ఆధార్, పాన్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12వేల వేతనం, అదనంగా టీఏ, డీఏ చెల్లిస్తారని తెలిపారు.

పంచాయతీలకు రూ. 35.013 కోట్లు

అనంతపురం న్యూటౌన్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీలకు 2024-25 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు తొలివిడతగా రూ.35.013 కోట్లు కేటాయించినట్లు డీపీఓ నాగరాజనాయుడు తెలిపారు. ఇందులో బేసిక్ గ్రాంటుకు సంబంధించి రూ.14 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఇందులో 25 శాతం ఈఈఎస్ఎల్‌కు, 25 శాతం పెండింగ్ విద్యుత్ బిల్లుల చెల్లింపునకు వినియోగించేలా ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. టైడ్ గ్రాంట్స్‌కు సంబంధించి రూ.21 కోట్లను పారిశుధ్య నిర్వహణ క్లాప్‌మిత్రాలకు వేతన బకాయిలు చెల్లించేలా సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారి చేసినట్లు డీపీఓ తెలిపారు.

విస్తృతంగా 'ఉపాధి' కల్పించాలి

అనంతపురంటౌన్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం ద్వారా కూలీలకు విస్తృతంగా పనులు కల్పించాలని కలెక్టరు వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ఉపాధి పనులపై సమీక్షించారు. జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఏపీడీలు ఏపీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టరు మాట్లాడుతూ ఉపాధి పథకం కింద నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. కూలీల సంఖ్యను పెంచి లేబర్ బడ్జెట్‌లో కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. వజ్రకరూరు, కూడేరు మండలాలలో కూలీల సంఖ్య మరింతపెంచాలన్నారు. జిల్లాలో మండలాల వారీగా ఎక్కడెక్కడ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయో వాటి వివరాలుపక్కాగా పంపాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సీసీరోడ్ల నిర్మాణాలు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు పూర్తిచేయాలన్నారు. ప్లాంటేషన్ కూడా వారంలో పూర్తి కావాలన్నారు. మండలాలవారీగా జరుగుతున్న పనుల వివరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, హార్టికల్చర్ డీడీనరసింహరావు, హౌసింగ్ పీడీ శైలజ, ఏపీడీ శైలజ, ఆర్‌డబ్ల్యుఎస్, పీఆర్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంటైనర్ వాహనం బోల్తా

చెన్నేకొత్తపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ఓ కంటైనర్ వాహనం బోల్తా పడింది. తమిళనాడు రాష్ట్రం సేలం నుంచి ఢిల్లీకి వెళ్తున్న కంటైనర్ చెన్నేకొత్తపల్లి సమీపానికి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఇద్దరు డ్రైవర్లు సురక్షితంగా బయటపడ్డారు. ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో ప్రమాదస్థలానికి వెళ్లి రోడ్డుకు అడ్డంగా పడిన వాహనాన్ని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.



జాతీయ రహదారిపై బోల్తాపడిన కంటైనర్



సభలో ప్రసంగిస్తున్న మంత్రి సవిత, వేదికపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, టీడీపీ, సీపీఐ, బీసీ సంఘాల నాయకులు

వివక్షకు వ్యతిరేకంగా..

(5వ పేజీ తరువాయి)

ఎంపీ స్థానాలను బీసీలకు కేటాయించారని అన్నారు. తనకు మంత్రిగా అవకాశం కల్పించారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కనకదాస జయంత్యుత్సవాలు నిర్వహించాలని, ప్రతి జిల్లా కేంద్రంలో వేడుకలకు రూ.12.50 లక్షలు చొప్పున నిధులను ముఖ్యమంత్రి కేటాయించారని అన్నారు. భక్త కనకదాస ఊరూరా తిరుగుతూ తన కీర్తనల చేత ప్రజలను చైతన్యపరిచారని అన్నారు. సంఘటితగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని చాటారని అన్నారు. కనకదాస కురుబ కులంలో జన్మించడం గర్వకారణమని అన్నారు. బీసీలు టీడీపీ పార్టీ బ్యాక్‌బోన్ అని సీఎం చెప్పారని, ప్రతి బీసీ వ్యాపారవేత్త కావాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని సూచించారు. కురుబలు షీప్ ఫామ్ పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నారని, వారికి రూ.50 లక్షల వరకూ రుణాలు ప్రతి యూనిట్‌కి ఇస్తామని తెలిపారు. యూనిట్‌కి రూ.5 లక్షల నుంచి రూ.కోటి వరకూ రుణం బీసీ సంక్షేమశాఖ తరుపున ఇచ్చే అవకాశం ఉందని అన్నారు. అందులో 10 శాతం లబ్ధిదారుని వాటా, 40 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు రుణం వస్తుందని అన్నారు. గతంలో ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు నిధులు లేకుండా ఉత్సవ విగ్రహాలుగా మారయని అన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్లకు రూ.1000 కోట్ల వరకూ నిధులు ఇచ్చామని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక డీఎస్సీని విడుదల చేశామని, అభ్యర్థులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. టీటీడీలో బోర్డు మెంబర్‌గా కురుబలకు వచ్చే దశలో అవకాశం ఇస్తామని అన్నారు.



కనకదాస విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్



గొరవయ్యల నృత్య ప్రదర్శన

● సంతోషకరం: కలెక్టర్



భక్త కనకదాస జయంతి రాష్ట్రస్థాయి ఉత్సవాలను జిల్లాలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని అన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని అన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కనకదాస జయంత్యుత్సవాలలో విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు, గొరవయ్యల సంప్రదాయ వేషధారణ, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వేడుకలను విజయవంతం చేసిన కలెక్టర్‌కు మంత్రి శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. కురుబ సంఘాల నాయకులు, టీడీపీ, బీసీ సంఘాల నాయకులను మంత్రి, ఎమ్మెల్యేలు ఘనంగా సత్కరించారు. వేడుకలలో బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్, కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, డైరెక్టర్ మల్లికార్జున, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ, ఆర్డీఓ కేశవనాయుడు, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, అనంతపురం తహసీల్దారు హరికుమార్, జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ దక్షిణాది రాష్ట్రాల గౌరవ అధ్యక్షులు బాసినేని వెంగమేష్ చౌదరి, సీపీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్, టీడీపీ నాయకులు గంజే నాగరాజు, ఆవుల కృష్ణయ్య, కురబ నారాయణస్వామి, కురబ సంఘాల నాయకులు తుప్పటి ఈశ్వరయ్య, తగరకుంట కృష్ణమూర్తి, ఆంజనేయులు, గంగులకుంట రమణ, శీనయ్య, విఠల్‌గౌడ్, బాలాజీ, మల్లికార్జున, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి: గేయానంద్



మాట్లాడుతున్న గేయానంద్

అనంతపురంటౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న ఆశాకార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టరు గేయానంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగభద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవుల జీఓలు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ వయసు 62ఏళ్లకు పెంచాలని, రాజకీయనేతలు, అధికారుల వేధింపులు ఆపాలని, ఖాళీగా ఉన్న ఆశాపోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆశాల ఆందోళనకు గేయానంద్, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్రకుమార్ మద్దతు పలికారు. వారు మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యపరిరక్షణకు ఆశాలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అయినా కనీసవేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి ఆశాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రీవెన్స్‌లో జేసీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాల్, రామాంజనేయులు, బాలరంగయ్య, ఆశాలు మాలతి, నాగమణి, అక్కమ్మ, భాగ్యమ్మ, హుస్సేన్, అంబికా, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కామిరెడ్డిపల్లికి స్కెచ్..?

● జడ్పీ వైస్ చైర్మన్ ఇంటి ప్రహరీకి కరెంటు

● ఫెన్సింగ్ నుంచి 33 కేవీ లైన్ వరకూ వైర్లు

ధర్మవరం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం కామిరెడ్డిపల్లి గ్రామంలో ఉమ్మడి అనంతపురం జడ్పీ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి ఇంటి ప్రహరీకి, ఆవరణంలో ఉన్న పశువుల దొడ్డికి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌కు గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే ప్రయత్నం చేశారు. తద్వారా ఆ ఇంట్లో ఉండేవారికి ముప్పు తలపెట్టే ప్రయత్నం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి ఇంటి చుట్టూ ఉన్న ఫెన్సింగ్, పశువులదొడ్డి ఫెన్సింగ్ తీగలకు విద్యుత్ వైర్లను అమర్చారు. వాటిని 50 అడుగుల దూరంలో ఉన్న 33 కేవీ విద్యుత్ స్తంభం వరకూ పరిచారు. విద్యుత్ స్తంభానికి ఉన్న ఫైబర్ నెట్ వైర్ వరకు ఈ తీగలను లాగారు. గ్రామానికి చెందిన వీరారెడ్డి సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్తుండగా కాలికి విద్యుత్ తీగ తగలడంతో అనుమానంతో పరిశీలించాడు. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆ సమయంలో బెంగుళూరులో ఉన్న కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి.. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు తెలియజేశారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది, ఇంటెలిజెంట్స్ పోలీసులు గ్రామానికి వెళ్లి సుధాకర్‌రెడ్డి ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడ నుంచి విద్యుత్ వైర్ తెచ్చారు, ఎవరు, ఎలా అమర్చారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం సాయంత్రానికి సుధాకర్‌రెడ్డి స్వగ్రామానికి చేరుకుఆన్నరు. ప్రతిరోజూ పశువులను దొడ్డిలో కట్టేసేందుకు వెళుతుంటామని, ఆ సమయంలో తనకు ప్రమాదం తలపెట్టాలని చూశారని సుధాకర్ రెడ్డి అన్నారు. ఈ ఘటనపై సుధాకర్‌రెడ్డి సోదరుడు రవీంద్రారెడ్డి ధర్మవరం రూరల్ పోలీసులకు సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు.



ఫెన్సింగ్‌కు కరెంటు తీగ

మునిసిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సస్పెన్షన్

గుంతకల్లు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): అక్రమంగా కొళాయి కనెక్షన్లను ఇచ్చారన్న కారణంగా మున్సిపల్ ఉద్యోగులు కే ఈరన్న, సోమశేఖర్ రెడ్డిపై గుంతకల్లు మునిసిపల్ కమిషనరు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనరు నయ్యాం అహ్మద్ ఆదివారం సస్పెన్షన్ ఉత్తర్వులిచ్చారు. ఇంజనీరింగ్ శాఖ శాశ్వత ఉద్యోగి ఈరన్న, తాత్కాలిక ఉద్యోగి సోమశేఖర్ రెడ్డి పట్టణంలోని కొనకొండ్ల రైల్వే గేటు వద్ద ఉన్న ఆర్టీటీ కాలనీలో కొందరికి అక్రమంగా కొళాయి కనెక్షన్లను ఇచ్చినట్లు మునిపల్ అధికారులకు ఫిర్యాదులందాయి. దీంతో మునిసిపల్ కమిషనరు విచారణకు ఎంఈని ఆదేశించారు. విచారణలో ఈ ఇద్దరు ఉద్యోగులు ఒక్క ఆదివారమే అక్రమంగా ఐదు కొళాయి కనెక్షన్లను ఇచ్చారని తేలింది. అలాగే కొళాయి అక్రమ కనెక్షన్ల కోసం రోడ్డును కూడా ఎక్స్‌కవేటర్‌తో ఇష్టానుసారంగా తవ్వేసినట్లు విచారణలో తేలిందని కమిషనర్ వెల్లడించారు. అందుకే వారిద్దరిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు పేర్కొన్నారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలి: జేసీ

అనంతపురంటౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై వచ్చిన ప్రతి బాధితుడి అర్జీని పరిశీలించి, పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టరు శివనారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీతో పాటు డీఆర్ఓ మలోల ఇతర అధికారులు ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా 321మంది తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతులు అందజేసినట్లు జేసీ తెలిపారు. గ్రీవెన్స్ అనంతరం జాయింట్ కలెక్టరు ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రతిఫిర్యాదును బాధ్యతగా తీసుకొని వాటికి పరిష్కారం చూపాలన్నారు. అర్జీ ఇచ్చిన ఫిర్యాదుదారుడితో మాట్లాడి వారు సంతృప్తిపడేలా సమాధానం ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైసీపీ అధికారుల నిర్లక్ష్యంతోనే హత్య

● కృష్ణమూర్తి హత్యోదంతంపై సందిరెడ్డి ఆగ్రహం

అనంతపురం సెంట్రల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ కార్యకర్త కామిశెట్టి కృష్ణమూర్తి హత్యకు వైసీపీ ప్రభుత్వంలో అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు మండిపడ్డారు. రోడ్లు, భవనాల అతిథిగృహంలో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. కృష్ణమూర్తి హత్యకు దారితీసిన కారణాలను సందిరెడ్డి వివరించారు. బొమ్మనహాళ్ మండలం చంద్రగిరికి చెందిన కామిశెట్టి కృష్ణమూర్తికి అదే మండలం కురవహళ్లికి చెందిన వైసీపీ కార్యకర్త బోయ శ్రీనివాసులు పొలాన్ని అమ్మారని తెలిపారు. అనంతరం తిరగబడిన శ్రీనివాసులు తరచూ కృష్ణమూర్తితో గొడవలకు దిగేవాడన్నారు. గొడవలెందుకుని భావించిన కృష్ణమూర్తి ఆయనకొన్న పొలంలోనే కొన్ని సెంట్ల భూమిని శ్రీనివాసులకు తిరిగి అప్పగించారని తెలిపారు. అయినా 2021లో కృష్ణమూర్తిపై హత్యా యత్నం చేశారని వాపోయారు. సమస్యను పరిష్కరించాలని నిందితులపై కేసు నమోదుచేసి న్యాయం చేయాలని మూడు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరిగారన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. చివరికి కృష్ణమూర్తి హతమయ్యాడని పేర్కొన్నారు. హత్యచేసిన బోయ శ్రీనివాసులు, సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. అదేవిధంగా సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ జగదీష్‌ను కలిసి ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో నాయకులు రత్నమయ్య, దేవిరెడ్డి లక్ష్మీదేవి, లలిత్‌కుమార్, అశోక్‌రెడ్డి, గోపాల్, సూర్యప్రకాష్, సోమయ్య, ఇలియాజ్, దిలీప్, రాజేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ జగదీష్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సందిరెడ్డి శ్రీనివాసులు

● కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం: అంబికా



సామాన్య కుటుంబంలో జన్మించి, కుల వివక్షకు వ్యతిరేకంగా భక్త కనకదాస పోరాడారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. సమాజంలో అందరూ సమానమని, అందరూ మంచి మిత్రులుగా మెలగాలని సూచించారు. కురుబలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. ఇంతకు ముందు ఎవరూ అంతటి ప్రాధాన్యం కల్పించలేదని అన్నారు. కురుబ కనకదాస కళ్యాణ మండపం కోసం ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయిస్తామని అన్నారు.

● మాట నిలబెట్టుకున్న చంద్రబాబు: బీకే



భక్త కనకదాస జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని ఎన్నికలకు ముందు చంద్రబాబుని అడిగామని, అందుకు అంగీకరించారని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు అధికారికంగా కనకదాస జయంతిని నిర్వహిస్తున్నారని అన్నారు. కురుబలు 20 సంవత్సరాల నుంచి ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతున్నారని అన్నారు. వారికి చదువు, సంస్కారం, పాలనలో భాగస్వామ్యం ఉందని అన్నారు. కనకదాసను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు.

● కురుబలకు అండ: పరిటాల సునీత



పరిటాల కుటుంబం మొదటి నుంచి కురుబలకు అండగా ఉంటోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కష్టకాలంలో కూడా కురుబలు తమ వెన్నంటే నడిచారని అన్నారు. ఒకప్పుడు పార్థసారథిని జడ్పీ చైర్మన్‌ని చేయడంతో పాటు ఎంతో మంది కురుబలకు స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించిన వ్యక్తి పరిటాల రవి అని గుర్తు చేశారు. ఆ రోజుల్లో రామచంద్రారెడ్డి లాంటి వారిని ఎన్టీఆర్ మంత్రిని చేశారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కురుబలకు ప్రాధాన్యమిస్తూ, వారికి అండగా నిలిచారని అన్నారు. కురబలకు ప్రధానమైన వృత్తి గొర్రెల పెంపకమని, ఇటీవల గొర్రెలు వ్యాధుల బారిన పడి చనిపోతుండటంతో వారు నష్టపోతున్నారని అన్నారు. వారిలో అవగాహన పెంచి.. బీమా చేయించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. రాప్తాడు నియోజకవర్గంలో కురుబలకు గొర్రెలు, మేకల యూనిట్లు, రుణాలు ఎక్కువగా ఇవ్వాలని కోరారు.

● కురుబలకు ప్రాధాన్యం: దగ్గుపాటి



ముఖ్యమంత్రి చంద్రబాబు కురుబలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. పెనుకొండకు ప్రాతినిధ్యం వహించిన సవితమ్మకు మంత్రి పదవి ఇచ్చారని, హిందూపురం ఎంపీగా పార్థసారథికి అవకాశం కల్పించారని అన్నారు. భక్త కనకదాస సామాన్యులకు అర్థమయ్యేలా రచనలు చేశారని అన్నారు. కృష్ణ భక్తుడిగా తన జీవితాన్ని దైవానికి అంకితం చేశారని అన్నారు. సమాజంలో వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. కురబలకు ఆరాధ్యదైవంగా ఆయన నిలిచారని కొనియాడారు.

● కురుబల పండుగ: అమిలినేని



కనకదాస రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాలు కురుబలకు గొప్ప పండుగ అని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. జిల్లాలో కురుబలు చాలా మంది ఉన్నారని, వారికి చాలా సమస్యలు ఉన్నాయని అన్నారు. కేంద్రంలో కావాల్సినన్ని నిధులు ఉన్నాయని, ఉమ్మడి జిల్లాకు అవసరమైన నిధులను తీసుకురావాలని ఎంపీలను కోరారు. వచ్చే సంవత్సరం నిర్వహించే కనకదాస జయంతికి ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తామని అన్నారు. కళ్యాణదుర్గంలో కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. అన్ని రకాలుగా కురుబలకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

హంద్రీనీవా సామర్థ్యాన్ని పెంచాలి

● ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచాలని ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం శ్రీనివాసులు అన్నా రు. స్థానిక సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1988లో ప్రారంభమైన ప్రాజెక్టు 35 ఏళ్లు గడిచినా పూర్తి కాకపోవడం దారుణమన్నారు. 2012-13లో మొదటి దశలో జీడిపల్లికి హంద్రీనీవా నీళ్లు వచ్చాయన్నారు. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత రెండో దశలో కాలువ పనులు పూర్తి చేసి గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లకు నీరు అందించారన్నారు. మూడేళ్ల కిందట హంద్రీనీవా కాలువలో 9 నెలలు నీరు ప్రవహించిందన్నారు. 40టీఎంసీలు నీరు వచ్చినా ఉమ్మడి జిల్లాలో కేవలం 160 చెరువులను అరకొరగా నింపారన్నారు. జీడిపల్లి నుంచి చిత్తూరు జిల్లా వరకు కాలువ వెడల్పు చేయాలన్నారు. హంద్రీనీవా కాలువ నుంచి పిల్లకాలువలు ఏర్పాటు చేసి రాయలసీమలోని 4జిల్లాల్లో 6,02,500ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వాలన్నారు. హంద్రీనీవా కాలువ నిర్మాణానికి పూర్తి స్థాయిలో ప్రత్యేక బడ్జెట్‌ను ప్రభుత్వం విడుదల చేసి రెండు సంవత్సరాలలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2009లో ప్రారంభించిన హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. పీఏబీర్ ప్రాజెక్టులో 11 టీఎంసీలు నీరు నిల్వ ఉండేలా నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ సురేష్, సభ్యులు జిలాన్, సత్తార్, బాషా, నారాయణ, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలకు రూ.5లక్షలు ఇవ్వాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్



పంచాయతీ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న జాఫర్, సీపీఐ నాయకులు

అనంతపురంరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరల దృష్ట్యా పేదల గృహ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. ఐదు లక్షల ఆర్థిక సాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు పేదలకు ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో వారికి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 3సెంట్లు ప్రకారం స్థలాలు ఇవ్వాలని మండలంలోని సోములదొడ్డి పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జాఫర్‌తో పాటు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున హాజరై మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సాయం ఏమాత్రం సరిపోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో దాటవేత ధోరణి అవలంభిస్తున్నారని విమర్శించారు. మండలంలోని కందుకూరు, కక్కలపల్లి కాలనీ, కృష్ణంరెడ్డిపల్లి, ఆకుతోటపల్లి, పూలకుంట, అక్కంపల్లి, రుద్రంపేట గ్రామాల్లోని సచివాలయాల్లో కూడా సీపీఐ నాయకులు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రూరల్ మండలం కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి నరేష్, నగర సహాయ కార్యదర్శి అల్లీపీరా, రామయ్య, వరలక్ష్మి, జిల్లా సమితి సభ్యులు ఈశ్వరయ్య, శాంతి పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఇందిరాగాంధీ (జయంతి)



'భారతరత్న' పురస్కార గ్రహీత ఇందిరా ప్రియదర్శిని గాంధీ 1917 నవంబరు 19న అలహాబాద్ (ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్)లో జన్మించారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కుమార్తెగానే కాకుండా దేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా తనదైన గుర్తింపు పొందారు. తండ్రి తర్వాత సుదీర్ఘ కాలం ప్రధానిగా కొనసాగారు. 1966 నుంచి 1977 వరకు, తిరిగి 1980 నుంచి 1984 వరకు ప్రధానిగా వ్యవహరించారు. బంగ్లాదేశ్ లిబరేషన్ వార్‌పై విజయం సాధించడంతో అంతర్జాతీయంగా పేరొం దారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా విదేశీ వ్యవహారాల విధానాన్ని సరళీకృతం చేశారు. 'గరీబీ హఠావో' నినాదంతో ప్రజలకు చేరువయ్యారు. అంతకుముందు కేంద్ర ఆర్థిక మంత్రిగాను, డిఫెన్స్ మంత్రిగాను వ్యవహరించారు. 1959లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలిగాను వ్యవహరించారు. ఫిరోజ్ గాంధీని వివాహమాడారు. 1984 అక్టోబరు 31న కన్నుమూశారు. 2020లో టైమ్ మ్యాగజైన్‌లో 20వ శతాబ్దపు వందమంది శక్తివంతమైన మహిళల్లో ఒకరిగా నిలిచారు.

సలీల్ చౌదరి (జయంతి)



అభిమానులచే 'సలీల్ దా'గా పిలవబడే సలీల్ చౌదరి 1922 నవంబరు 19న పశ్చిమబెంగాల్ రాష్ట్రం ఘాజీపూర్‌లో జన్మించారు. కవిగా, గేయ రచయితగానే కాక సంగీత దర్శకుడిగా రాణించారు. అత్యధికంగా హిందీ, బెంగాలీ, తెలుగు, తమిళ, కన్నడతోపాటు 13 భాషలలో 150కుపైగా సినిమాలకు సంగీతాన్ని అందించిన ఘనత ఆయనది. దేశవాళీ సంగీతానికి పాశ్చాత్య సంగీతాన్ని మేళవించడం ప్రత్యేకత. రాష్ట్రపతి అవార్డు, ఫిల్మ్‌ఫేర్, సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర పురస్కారాలు పొందారు. 1995 సెప్టెంబరు 5న కన్నుమూశారు.

కనకదాస ఆదర్శాలు అనుసరణీయం



బాగేపల్లిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం



కనకదాస జయంతిలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి



బంగారుపేటలో కనకజయంతిలో ఎమ్మెల్యే నారాయణస్వామి



చింతామణిలో ప్రసంగిస్తున్న మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్



మేలూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో కనకదాస జయంతి

బాగేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న అంధకారాన్ని తొలగించేందుకు శ్రమించిన కనకదాస ఆదర్శాలు మనకు మార్గదర్శకంగా ఉన్నాయని తహసీల్దారు మనీశా మహేశ్‌పత్రి అభిప్రాయపడ్డారు. బాగేపల్లి పట్టణంలోని తాలూకా పంచాయతీ సభాంగణంలో జాతీయ పండుగల సమితి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటైన కనకదాస జయంతిలో పాల్గొన్నారు. కనకదాసు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. దాస పరంపరలో సర్వశ్రేష్ఠులుగా కనకదాసు నిలిచారన్నారు ఆయన తత్వజ్ఞాన భావాలు, కీర్తనలతో సమాజంలో చైతన్యం కల్పించేందుకు కృషి చేశారన్నారు. ప్రత్యేకించి కులాల తారతమ్యాన్ని తగ్గించేందుకు పాటుపడ్డారన్నారు. ఆయన జయంతి కేవలం ఒకరోజుకు పరిమితం కాకుండా మన జీవనంలో అలవరచుకోవాలన్నారు. ఇదే సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సి, పీయూసీలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వివిధ రంగాల సాధకులను ఆత్మీయంగా సత్కరించారు. పురసభ సభ్యుడు శ్రీనాథ్, బీఈఓ ఎన్ వెంకటేశప్ప, ఆర్ హనుమంతరెడ్డి, శివప్ప, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, కురుబ సామాజిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

మేలూరులో సరళంగా కనకజయంతి

శిడ్లఘట్ట: తాలూకాలోని మేలూరు గ్రామంలో 537వ కనకదాస జయంతిని సోమవారం సరళంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శశికళ అధ్యక్షత వహించి మాట్లాడుతూ కనకదాసు కీర్తనల ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు. సమాజంలో నేటికీ అవి అనుసరణీయమన్నారు. పంచాయతీ ఉపాధ్యక్షుడు శివానంద్, మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఉమేశ్‌లు ప్రసంగించారు. పంచాయతీ సభ్యులు రవిప్రసాద్, దేవరాజ్, భాగ్యమ్మ బచ్చేగౌడ, శారదా, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకులు కనకదాస : ఎమ్మెల్యే

మహదేవపుర: భగవాన్ శ్రీకృష్ణుడిని తన భక్తిశ్రద్ధలతో కొలిచి మహా దార్శనికులుగా కనకదాస ఆదర్శాలు ప్రస్తుత సమాజానికి స్ఫూర్తిగా నిలిచారని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని వర్తూరు గాంధీ సర్కిల్‌లో ఏర్పాటైన 537వ జయంతిలో పాల్గొని ప్రసంగించారు. శతాబ్దాలు గడిచినా కనకదాస కీర్తనలు నేటికీ ప్రజలను చైతన్యం కలిగిస్తున్నాయన్నారు. ఉడుపి శ్రీకృష్ణమఠానికి వెళ్లిన వేళ మఠం ముందు తలుపులు మూసి ఉన్నా వెనుకవైపున కిటికీ నుంచి దర్శనం చేసుకోవచ్చునన్నారు. ఇందుకు కనకదాస భక్తికి నిదర్శనమన్నారు. యువ ప్రముఖుడు రక్షిత మాట్లాడుతూ కుల వ్యవస్థలో ఉన్న తారతమ్యాలపై కీర్తనల ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు. ఈ సందర్భంగా వర్తూరు పురవీధులలో కనకమూర్తిని వైభవంగా ఊరేగించారు. వివిధ కళాబృందాలు డొళ్ళుకుణిత, కంసాళె, తదితర బృందాలు అలరించాయి. కార్యక్రమంలో బీజేపీ హోబళి అధ్యక్షుడు మనోహరరెడ్డి, మహేంద్రమోది, రాజేశ్, కనకసేవా సమితి అధ్యక్షుడు శ్రీధర్, గౌరవాధ్యక్షుడు త్యాగరాజ్, ప్రముఖులు చిక్కణ్ణ, సురేశ్, లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంగారపేటలో..

బంగారపేట సమాజంలో కులమతాల తారతమ్యానికి అజ్ఞానమే కారణమని సామరస్యంకోసం దార్శనికులు కనకదాసు ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే నారాయణ స్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని పురసభ ఆవరణలో జాతీయ పండుగల ఆచరణ సమితి, తాలూకా కురుబసంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసిన కనక జయంతిలో పాల్గొని మాట్లాడారు. కుల వ్యవస్థలోని లోటుపాట్లను సరిదిద్దేలా భక్తి మార్గంలో కీర్తనల ద్వారా ప్రజలను చైతన్యం తెచ్చారన్నారు. కన్నడ సాహిత్యానికి ఆయన సేవలు అనన్యమన్నారు. కాగా పురసభ సర్కిల్‌లో సామాజిక వర్గం డిమాండ్ మేరకు సంగొళ్ళిరాయణ్ణ, కనకదాస కాంస్య విగ్రహాలను సొంత ఖర్చుతో ఏర్పాటు చేస్తామన్నారు. పురసభ అధ్యక్షుడు గోవింద, ఉపాధ్యక్షురాలు చంద్రవేణి, జిల్లా ప్రాథమిక సంఘం అధ్యక్షుడు అప్పయ్యగౌడ తదితరులు పాల్గొన్నారు.

చింతామణి: కనకదాస సందేశాలను జీవితానికి అన్వయించుకోవడం ద్వారా జీవితాన్ని బాగు చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. తాలూకా పాలకమండలి, జాతీయ పండుగల ఆచరణ సమితి, తాలూకా కురుబ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కనకదాస జయంతి ఘనంగా జరిగింది. కనకదాస చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తహసీల్దార్ సుదర్శన్ యాదవ్, ఈఓ ఆనంద్, నగరసభ కమిషనర్ చలపతి, బీఈఓ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. తాలూకా వ్యాప్తంగా కనకదాస జయంతి కార్యక్రమాలు సందడిగా సాగాయి. వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. సోమవారం ఎటుచూసినా సందడి నెలకొంది.

నగరానికి దూరంగా
అమెజాన్ కార్యాలయం

బెంగళూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగర నడిబొడ్డున రాజాజినగర్‌లోని వరల్డ్ ట్రేడ్‌సెంటర్‌లో ఉంటే ప్రముఖ ఆన్‌లైన్ రిటైల్ కంపెనీ అమెజాన్ సంస్థ ఖర్చు తగ్గించుకోవడంలో భాగంగా నగరానికి దూరంగా వెళ్లేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు చెందిన 30 అంతస్తుల భవనంలో అర మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో అమెజాన్ కంపెనీ కొనసాగుతోంది. ప్రస్తుతం ఇక్కడ 5వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. నగరానికి దూరంగా దేవనహళ్ళి ఎయిర్‌పోర్ట్ నుంచి 15 నిమిషాలు ప్రయాణించేంతటి దూరంలో నిర్మించదలిచారు. 2025 ఏప్రిల్‌లో ప్రారంభిస్తే ఏడాది తర్వాత పూర్తిగా మార్పు కావచ్చునని అమెజాన్ ప్రతినిధులు తెలిపారు. అయితే ఒప్పందం ప్రకారం వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను పూర్తిగా వదులుకునేది లేదని కూడా స్పష్టం చేశారు.

ఫెస్టివల్ ఆఫ్ అస్ట్రేలియాకు ఆదరణ

బెంగళూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాలలో ఫెస్టివల్ ఆఫ్ ఆస్ట్రేలియా పేరిట ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్ట్రేలియాలోని రిటైల్ వ్యాపారాలు, పర్యాటక ప్రాంతాలు, ప్రముఖ సంస్థలు, యూనివర్సిటీలను పరిచయం చేసేలా రోడ్‌షో జరిపారు. మ్యాక్సమ్ ఆస్ట్రేలియా ఫౌండర్ సీఈఓ రెనెటా స్గురియో మాట్లాడుతూ భారత్ - ఆస్ట్రేలియాల మధ్య ఎన్నో ఏళ్లుగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. ఆస్ట్రేలియాలో తేనె, చీజ్, పాస్తా, మాంసపు ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు భారత్‌కు ఎగుమతి చేస్తుంటామన్నారు. ఆస్ట్రేలియా రుచులను పరిచయం చేశారు. దక్షిణ ఆసియా వ్యాపార పెట్టుబడుల విభాగం కమిషనర్ వికెసింగ్‌తోపాటు పలువురు ఉన్నారు.

చీనీ టన్ను రూ. 35వేలు

అనంతపురం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 35,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 14వేలు, సరాసరి రూ. 24వేలుతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 75 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ముగ్గురి అరెస్టు

గోరంట్ల, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గోవధ శాలలు, మాంసం ర వాణాపై పోలీసులు పదేప దే దాడులు చేస్తున్నా వారి లో మార్పు రావట్లేదు. య థేచ్ఛగా రవాణా చేస్తున్నారు. మండలంలోని గుమ్మయ్యగారిపల్లి కూడలిలో 400 కిలోల గోమాంసాన్ని కారులో తరలిస్తుండగా పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. కారులో గోమాంసం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. కర్ణాటకలోని బాగేపల్లి వాసి హైదర్‌అలీ, గోరంట్లకు చెందిన తండ్రి, కొడుకు షేక్ అన్సర్, అన్వర్ సాబ్‌ను అరెస్టు చేశారు. ప్యాకింగ్ చేసిన మాంసాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కాడుమల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పూజలు



దీపాలు సమర్పిస్తున్న భక్తులు

బెంగళూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకుని మల్లేశ్వరంలోని కాడుమల్లేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్థానికంగా వేరుశనగ పరుష ఈనెల 15న ప్రారంభం కాగా సోమవారం ముగిసింది. ఇలా కార్తీకసోమవారంతో విశేషపూజలు ఒకవైపు, పరుష మరోవైపు కొనసాగడంతో మల్లేశ్వరం ప్రాంతం సందడిగా నిలిచింది.

శిడ్లఘట్ట: పట్టణంలోని అశోకరోడ్డులో కొలువైన నగరేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మూడోసోమవారం విశేషపూజలు కొనసాగాయి. ఆలయశుద్ధి అనంతరం స్వామివారికి 6 గంటలనుంచి 9వరకు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, తైలాభిషేకం ఇతర ధార్మిక కైంకర్యాలు కొనసాగాయి. బిల్వపత్రాలు, తులసి, పుష్పాలతో అలంకరించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఇదే తరహాలో చంద్రశేఖరస్వామి ఆలయం, కాశీవిశ్వనాథస్వామి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయం, వీరాపురలోని వినాయకస్వామి ఆలయం తదితర ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.



శిడ్లఘట్టలో నగరేస్వామికి అలంకరణ

బీజేపీలోకి కాంగ్రెస్
ఎమ్మెల్యేలను పంపింది సిద్దరామయ్యే

» కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ కుట్ర పన్నిందనే సీఎం సిద్ధరామయ్య ఆరోపణలకు కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి తిప్పికొట్టారు. హుబ్బళ్ళిలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నింది సిద్దరామయ్య అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పంపింది ఎవరని ప్రశ్నించారు. కాంగ్రెస్‌వారికి పాలన సాగించే నైతికత లేనప్పుడే మేం అధికారంలోకి వచ్చామని యడియూరప్ప ముఖ్యమంత్రి అయ్యారన్నారు. మేం ఎవరికీ రూ.50 కోట్లు, 100 కోట్లు ఆఫర్ ఇవ్వలేదన్నారు. మరో రెండు రోజుల్లో మహారాష్ట్ర పోలింగ్ ఉన్న తరుణంలో రాష్ట్రంలో రాజకీయ విమర్శలు వేడెక్కాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే రవికుమార్ గణిగ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. సీఎం సిద్దరామయ్య ఓ ఎమ్మెల్యేకు రూ.50కోట్లు ఆఫర్ ఇచ్చారని ఆరోపిస్తుంటే, వారి పార్టీ ఎమ్మెల్యే ఏకంగా రూ.100కోట్లు అంటున్నారని వాటికి ఎక్కడైనా పొంతన ఉందా..? అన్నారు. సిద్దరామయ్యపై కోర్టు ఆర్డర్ ఉందని దాని గురించి ఎందుకు ప్రశ్నించరన్నారు. తమపై ఉండే తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రోజుకో నాటకం ఆడుతున్నారన్నారు.

వివిధరంగాల సాధకులకు సన్మానం

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కృషిమేళాలో వివిధ రంగాల సాధకులను గుర్తించి సత్కరించారు. ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆదర్శ రైతులు, మహిళా రైతులను సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. దొడ్డబళ్ళాపుర తాలూకా హాడోనహళ్ళికి చెందిన రూపాకు డాక్టర్ ఎంహెచ్ మరిగౌడ రాష్ట్రస్థాయి అత్యున్నత 'తోటగారికె రైతు పురస్కారం' ప్రదానం చేశారు. బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యానవనాల సమాచార కేంద్రం ప్రాధ్యాపకురాలు డాక్టర్ ఎం శాలినికి డాక్టర్ ద్వారకీనాథ్ అత్యుత్తమ విస్తరణా కార్యకర్త పురస్కారాన్ని ప్రదానం చేశారు. హొళె నరసీపుర తాలూకా ఉన్నేనహళ్ళి యుఎం నాగవర్మకు డాక్టర్ ద్వారకీనాథ్ ఉత్తమ రైతు పురస్కారాన్ని రాష్ట్ర బయో ఇంధన అభివృద్ధి మండలి అధ్యక్షుడు ఏఎస్ఈ సుధీంద్ర ప్రదానం చేశారు.



సన్మానంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు

సామూహిక సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

దొమ్మసంద్ర, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి నిక్కుంది గ్రామంలో మాలి సైని సమాజసంఘం ఆవరణలో వర్తూరు తెలుగుసంఘం ఆధ్వర్యంలో కార్తీకమాసం పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, వనభోజన మహోత్సవం నిర్వహించారు. సామూహిక వ్రతంలో 72 దంపతులు పాల్గొన్నారు. అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయం అర్చకుల తరపున కూడా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహదేవపుర నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు మనోహరరెడ్డి, వర్తూరు మాజీ కార్పొరేటర్ పుష్ప మంజునాథ్, బీజేపీ కార్యదర్శి నాగేశ్, స్వాభిమాన పక్ష అధ్యక్షుడు కుప్పి మంజునాథ్, వర్తూరు తెలుగుసంఘం అధ్యక్షుడు శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి పెళ్లిలో జర్మనీ దేశస్థుల సందడి

బెంగళూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాగల్కోటె తాలూకా బెనకట్టి గ్రామానికి చెందిన వెంకటేశ్ మేటి, కావ్యల పెళ్లి వేడుకల్లో జర్మనీ నుంచి వచ్చిన యువతీ యువకులు చిందులేశారు. జర్మనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా వ్యవహరిస్తున్న వెంకటేశ్ సొంతూరులోనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అందుకు అనుగుణంగానే పల్లెలో ఆదివారం పెళ్లి జరిగింది. 12మంది జర్మన్ యువతీ యువకులు నాలుగురోజుల ముందే బాగల్కోటెకు చేరుకున్నారు. దేశీయ సంప్రదాయ దుస్తులు ధరించి పెళ్లిలో మెహంది, రిసెప్షన్‌లో వారు సరదాగా గడిపారు. జర్మనీలో ఇటువంటి సంప్రదాయాలు పాటించరని వారు అభిప్రాయపడ్డారు. విదేశీ యువతీ యువకుల సందడి చూసేందుకు పెళ్లికొచ్చిన బంధుమిత్రులు, స్థానికులు తరలివచ్చారు.




సందడి చేస్తున్న జర్మన్ దేశస్థులు

టమోటా కిలో రూ. 30

అనంతపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 30తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 23, కనిష్ఠ ధర రూ. 16 పలికినట్లు ఆయన తెలిపారు.

చిన్నారులకు చిత్రలేఖన పోటీలు

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలు చిన్నారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ రెయిన్‌బో, డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్, ఎకో ఫౌండేషన్, సమర్థనం సంస్థ సంయుక్తంగా డ్రా యువర్ డ్రీమ్స్ పేరిట 300మంది చిన్నారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. నగర వ్యాప్తంగా 5-10 తరగతి పేద విద్యార్థులను ఎంపిక చేసి వండర్‌లా సందర్శనకు చిత్రలేఖనం పోటీలు జరిపారు.



డ్రాయింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

మార్మోగిన సాయినామం

● సత్యసాయిబాబా జయంత్యుత్సవాలకు శ్రీకారం ● వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం

పుట్టపర్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సాయినామం మార్మోగింది.. ఆధ్యాత్మిక పట్టణం పులకించిపోయింది. దేశవిదేశాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు సాయినామాన్ని స్మరిస్తూ భక్తి పారవశ్యం పొందారు. సత్యసాయి బాబా 99వ జయంత్యుత్సవాలకు సోమవారం పుట్టపర్తిలో శ్రీకారం చుట్టారు. తొలిరోజు శ్రీవేణుగోపాలస్వామి రథోత్సవం పట్టణ వీధుల్లో అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం 9 గంటలకు పెదవెంకమరాజు కల్యాణమంటపంలో వేణుగోపాలస్వామి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి, మంగళవాయిద్యాలతో ప్రశాంతి నిలయం గోపురం వద్దకు తీసుకొచ్చారు. సాయి కల్వంత్ మందిరంలో వేదపండితులు శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు. సీతారాములు కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాన్ని తీసుకురాగా, సీతారాముల పల్లకిని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రశాంతి మందిరం గోపురం వద్దకు తీసుకొచ్చారు. స్వామి ఉత్సవవిగ్రహాన్ని రథంలో కొలువుదీర్చారు. ఆర్జే రత్నాకర్ పూజలు చేసి, రథోత్సవాన్ని ప్రారంభించారు. సీతారాముల పల్లకి, విద్యార్థుల వేదపఠనం, భక్తుల సాయినామస్మరణ, కోలాటం, చెక్కభజన, కీలుగుర్రాలు, గొరవయ్యలు, డోలు, మంగళవాయిద్యాలు ముందువైపున సాగగా.. స్వామి రథం కదిలింది. ఎత్తైన భవనాల పైనుంచి రథోత్సవంపైకి భక్తులు పూల వాన కురిపించారు. దేశవిదేశాల నుంచి వచ్చిన భక్తులతో పురవీధులు కిక్కిరిశాయి.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.08	1,601.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,269	1,829
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,007	8,450
నీటి నిల్వ (టీఎంసీలు)	98.18	24.06

పరీక్షల్లో అవకతవకలపై నిరసన

● విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న కేపీఎస్‌సీ: ఏబీవీపీ ● రాయచూరులో నిరసనకారులపై కేసు



బళ్లారి గడిగ చెన్నప్పసర్కిల్లో ఏబీవీపీ సభ్యుల నిరసన



పరీక్షను బహిష్కరించి ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

బళ్లారి సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేపీఎస్‌సీ పరీక్షల్లో అక్రమాలపై ఏబీవీపీ నిరసన చేపట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల పోస్టులకు పవిత్రత లేకుండా పోయిందని, విద్యార్థి లోకానికి స్పష్టమవుతుందని ఏబీవీపీ రాష్ట్ర సహకార సంచాలకులు వినోద్, నగర కార్యదర్శి నవీన్ హుగార్ మండిపడ్డారు. సింధనూర్‌లో కేపీఎస్‌సీ పరీక్షల అక్రమాలపై నగర నడిబొడ్డు గడిగి చెన్నప్పసర్కిల్లో సోమవారం ఏబీవీపీ నిరసన చేపట్టింది. ఈ కార్యక్రమంలో నవీన్ హుగార్ మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన కేపీఎస్‌సీ పరీక్షల్లో పదేపదే అక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రశ్నాపత్రం లీకేజీ , ఇతర సంఘటనలను ఏబీవీపీ ఖండిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగల పరీక్షలకు భద్రత లేకుండా పోయిందన్నారు. రాయచూరు జిల్లా సింధనూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో 10గంటలకు బదులుగా 10-20 గంటలకు కేపీఎస్సీ ప్రశ్నాపత్రాన్ని జారీ చేయగా, పరీక్షా కేంద్రంలో ప్రశ్నాపత్రం సేకరిస్తున్న సమయంలో ప్రశ్నపత్రం సీల్ చేయలేదన్నారు. 24ప్రశ్నా పత్రాలకు గాను 12 ప్రశ్నాపత్రాలు మాత్రమే ఉన్నాయని, రాష్ట్రంలో పదే పదే ఇలాంటి ప్రశ్నాపత్రాల ఘటనలు జరుగుతున్నాయి. ఈ కేసులతో సంబంధం ఉన్న నిందితులను రాష్ట్రప్రభుత్వం కఠినంగా శిక్షించాలని, పీడీఓ పరీక్షను పునః పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నగరసంస్థ కార్యదర్శి భరత్‌తల్వార్,కార్యకర్తలు వరుణ్, బసవన్‌గౌడ, సాగర్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

12 మంది అభ్యర్థులపై కేసు

రాయచూరు : పీడీఓ పరీక్ష పత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో 12 మంది అభ్యర్థుల పై సింధనూరు నగర పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీఓ పోస్టుల కోసం అర్హత పరీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వహణ సందర్భంగా ఒక గదిలోకి రావల్సిన ప్రశ్న పత్రాల బండల్ మరో గదిలోకి రావడంతో కొరత ఏర్పడి అభ్యర్థులు అయోమయానికి గురయ్యారు. ఈ క్రమంలో అభ్యర్థులకు తప్పుడు సమాచారం ఇచ్చి ప్రశ్న పత్రం లీకేజీ కాకున్నా వదంతిని సృష్టించిన 12 మంది అభ్యర్థుల పై సింధనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు సోమవారం పశుపతితో పాటు మరో 11 మంది అభ్యర్థుల పై కేసు నమోదు చేసినట్లు సింధనూరు నగర పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ఒక ప్రకటనలో తెలిపారు.

మద్దతు ధరతో వరిని కొనుగోలు చేయాలి : రైతు సంఘం

బళ్లారి సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుంగభద్ర ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంట వర్షాలకు దెబ్బ తినిందని, పంటను ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ ఈసారి రైతులకు రెండో పంటకు నీరిచ్చినా వర్షాలు కొంప ముంచాయన్నారు. ఆర్ఎన్ఆర్ రకం వర్షాకాలంలో పండే వరి, సోనా మసూరి వరి రకాలు వర్షం కారణంగా నేలకొరిగాయన్నారు. ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్ల దాకా దిగుబడి తగ్గిందని, దీనిపై సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలన్నారు. మద్దతు ధరతో వరిని కొనుగోలు చేయాలన్నారు. ఒక్కో రైతు నుంచి 15నుంచి 40క్వింటాళ్ళు మాత్రమే కొనుగోలు చేస్తామన్న జిల్లాయంత్రాంగ నిర్ణయం సరికాదన్నారు. ఎకరాకు కనీసం 35క్వింటాళ్ల పంట పండుతుంది. కనీసం 150 క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. గతేడాది ఇదే సమయంలో మార్కెట్‌లో వరి క్వింటాళ్లకు రూ. 2700 నుంచి రూ. 3100 వరకు విక్రయించారు. కానీ ఇప్పుడు మార్కెట్ ధర కేవలం రూ.1900 కు పడిపోయిం దన్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభమైతే మార్కెట్ ధర పెరగుతుందన్నారు. సమావేశంలో ఆనుండి పంపనగౌడ, నాగరాజుగౌడ, బసవరాజస్వామి, ఉమాపతి,విశ్వనాథ్, ఓంకారిగౌడ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవరెడ్డి



బళ్లారిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మర్మోగిన ఓంకారం

బళ్లారిరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేళగుర్కి, కురుగోడు, హగరి, బళ్లారి తదితర ప్రాంతాల్లో కార్తీక మాసం సందర్భంగా మహిళలు పెద్దఎత్తున దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా బళ్లారి నగరం నుండి పెద్దఎత్తున భక్తతుకారామ్ పాల్గొని హగరి, వేదావతి నదిలో ప్రత్యేకంగా కార్తీక మాసం సందర్భంగా పుష్కరస్నానం చేసి హగరి సోమేశ్వర ఆలయంలో దీపాలు వెలిగించారు.



కురుగోడులో..

బయటపడ్డ చాళుక్యుల శాసనం

కంప్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విజయనగర జిల్లా హంపసాగర గ్రామంలో శివ శాంతివీర సముదాయ భవనం వద్ద తవ్వకాల్లో పురాతన చాళుక్యుల శిల్పం బయటపడింది. సంశోధకులు వీణ, మాంతేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిలాశాసనం చాళుక్యుల నాటిదని ఇందులో ఆ గ్రామ వివరాలు వున్నాయన్నారు. సాహిత్య భాష, లిపిలో చెక్కబడి వున్నాయన్నారు. హంపి సాగర గ్రామ వివరాలు కూడా చాళుక్యుల కాలంలో రాజులు శాసనాన్ని గుర్తుగా వుంచినట్లు తెలిపారు.



సాగర గ్రామంలో బయట పడిన శాసనం

సంగొళ్ళిరాయణ్ణ విగ్రహావిష్కరణపై వివాదం

బళ్లారి సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని దొడ్డనగౌడ రంగమందిరం ప్రక్కన బుడా పార్కు కూడలిలో సంగొళ్లి రాయణ్ణ విగ్రహావిష్కరణపై వివాదం చెలరేగింది. అనుమతి లేకుండా స్వాతంత్ర్య సమరయోధుడు క్రాంతి వీర సంగొళ్ళి రాయణ్ణ విగ్రహాన్ని సోమవారం ఉదయం ఆవిష్కరించారు. మధ్యాహ్నం సమయానికి, కార్పోరేషన్ సిబ్బంది దానిని ప్లాస్టిక్‌తో కప్పేశారు. ప్రముఖులను పిలవకుండా ఒక వర్గం వారు ప్రారంభించారని మరో వర్గం ఆరోపించింది. పోలీసులు వారిని నివారించి అక్కడి నుంచి పంపించారు. గతంలో మాజీ మంత్రి బి.శ్రీములు ఈ విగ్రహాన్ని సిద్ధం చేశారు. ఇది కార్పోరేషన్ 2023 మార్చిలో నిర్మించారు. ఈ ఉద్యానవనం బుడా అనుమతి లేకుండా ఏర్పాటు చేశారు. దీనిపై కార్పోరేషన్, బుడా అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈ సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా విగ్రహావిష్కరణ ఆలస్యమైంది. విధానసభ ఎన్నికలు జరిగాయి. లోక్‌సభ ఎన్నికలు కూడా జరిగాయి. సండూర్ ఉప ఎన్నిక కూడా జరిగింది. కానీ విగ్రహాన్ని మాత్రం అవిష్కరించలేదు. హాలుమత(పాలు మతస్థులు కురుబలు) సంఘం నేతలు ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఫోన్ చేసి విగ్రహాన్ని అవిష్కరిస్తామని చెప్పారు. సోమవారం కనక జయంతి సందర్భంగా కొందరు ప్రజాసంఘాల నాయకులు విగ్రహాన్ని అవిష్కరించి పూజలు చేశారు. అంతే కాకుండా విగ్రహ నిర్మాణానికి ఆర్థికంగా సహకరించి శ్రీరాములును పిలిపించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతే కాకుండా ఎంపీ తుకారం, మాజీ ఎమ్మెల్యే ఎల్.స్వామి,మాజీ డిప్యూటీ మేయర్ బెనకల్ బసవరాజు తదితరులు కూడా వచ్చి నివాళులర్పించారు. ఇదంతా జరిగే సమయానికి కార్పోరేషన్ సిబ్బంది ఓ పోలీసు అధికారితో వచ్చి రాయణ్ణ విగ్రహానికి మళ్ళీ ప్లాస్టిక్ గుడ్డ చుట్టారు. అన్ని రకాల అనుమతులు పొంది గ్రాండ్ గా తెరకెక్కించాలని వాగ్వాదానికి దిగింది. ఈసమయంలో పోలీసులు రంగప్రవేశం చేసి నిరసనకారులను చెదరగొట్టారు.



విగ్రహాన్ని కప్పేస్తున్న అధికారులు

నేలకొరిగిన పంటలను పరిశీలించిన అధికారులు

కంప్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎట్టకేలకు తాలుకా పరిధిలో పలు గ్రామాలలో రెవెన్యూ అధికారులు పంటల సర్వేలు ప్రారంభించారు. సోమవారం తోరణగల్లు పరిధిలోని హళే మాదాపురం, దరోజీ, ఇతర గ్రామాలలో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా అధికారి మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారమే కనిష్ఠ, గరిష్ఠ మొత్తంలో నేలకొరిగిన పంటలను పరిశీలించి జిల్లా అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. త్వరలో నష్ట పరిహారం అందుతుందని తెలిపారు.



పంటను పరిశీలిస్తున్న అధికారులు

హోసూరు జోన్

టీటీడీ మరమ్మతు పనులు దక్కడం హర్షణీయం


- మాజీ ఎమ్మెల్యే మనోహరన్



హోసూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన మరమ్మతు పనులను హోసూరు టీవీఎస్ ఫ్యాక్టరీ సంస్థకు లభించడం సంతోషంగా ఉందని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి, హోసూరు మాజీ ఎమ్మెల్యే కె. మనోహరన్ హర్షం వ్యక్తం చేశారు. టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత సోమవారం తొలిసారిగా బోర్డు సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల్లో హోసూరు టీవీఎస్ సంస్థ దేవాలయాలకు సేవలందించడం విషయాన్ని పరిగణలోకి తీసుకుని తిరుమల దేవస్థాన మరమ్మత్తు పనులను అప్పగించేలా తీర్మానించారు. ఈ అంశంపై మనోహరన్ మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయంలో సేవలు అందించడం టీవీఎస్ కర్మాగారానికి ఇవ్వడం స్వాగతిస్తున్నామన్నారు. టీవీఎస్ ఫ్యాక్టరీ ఇప్పటి వరకు తమిళనాడులో ఎన్నో దేవాలయాలను మరమ్మత్తులు చేసి ప్రశంసలు పొందిందన్నారు. చంద్రచూడేశ్వర ఆలయ గాలిగోపుర నిర్మాణంలోనూ కీలకంగా వ్యవహరించారన్నారు. అలాగే రాష్ట్రంలో ఎన్నో అంతరిస్తున్న పక్షులకు ఉద్యానవనం నిర్మించి సంరక్షిస్తున్నారని కొనియాడారు. టీవీఎస్ సంస్థ ఏపని చేపట్టినా నాణ్యతగా పనులను పూర్తి చేయడంతోపాటు నీతి నిజాయితీతో పారదర్శకంగా ఉందన్నారు. టీటీడీకి సేవలందించడం ద్వారా జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. హోసూరు ఫ్యాక్టరీలో హైజినిక్ విధానంలో నాణ్యమైన భోజనాన్ని కార్మికులకు అందిస్తున్నారని ప్రస్తావించారు. టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు.

బేడరపల్లి ప్రాంతంలో కలుషిత నీరు

హోసూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హోసూరు బేడరపల్లి బాలాజీ నగర్‌లో కుళాయిల నుంచి ఆకుపచ్చ రంగులో తాగునీరు రావడంతో ప్రజలు అవాక్కయారు. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2వేల కంటే ఎక్కువగా చిన్న, పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. కొన్ని ఫ్యాక్టరీలనుంచి విడుదలయ్యే రసాయన వ్యర్థాలను పరోక్షంగా సమీపంలోని చెరువులలోకి వదులుతున్నారు. వీటి ప్రభావం భూగర్భజలాలపై పడుతోంది. స్థానికంగా ఉంటున్న బోరుబావుల నీరు రంగు కూడా మారిపోతోందని వాపోతున్నారు. నీటిని వాడుతున్న ప్రజలు చర్మంపై దురదలు ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తలుస్తోంది. సమస్యలపై స్థానికులు కౌన్సిలర్ రజిని, కార్పొరేషన్ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న కమీషనర్ శ్రీకాంత్ స్వయంగా తనిఖీలు నిర్వహించారు. ఆకుపచ్చ రంగులో నీరు రావడంతో సదరు నీటిని వినియోగించరాదని ప్రజలకు సూచించారు. అలాగే కార్పొరేషన్ తరఫున కూడా నీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.



ఆకుపచ్చగా వస్తున్న తాగునీరు



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ సరయు

గ్రీవెన్స్‌లో 312 వినతులు

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీపుల్స్ గ్రీవెన్స్ రిడ్రేసల్ డే సమావేశంలో ప్రజలనుంచి 312 వినతులు అందాయి. కలెక్టర్ సరయు స్వయంగా ప్రజల సమస్యలను ఆలకించారు. ఇళ్ల పట్టాలు, ఉచిత కుట్టుమిషన్లు, వృద్ధాప్య భృతి, మహిళా హక్కుల భృతి, రోడ్డు సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ వంటి పలు డిమాండ్లపై ప్రజలు అర్జీలు సమర్పించారు. అర్హులైన వినతులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురళ్, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో సాహిత్య పరిషత్ బృందం భేటీ

హోసూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డీఎంకేకు అనుబంధమైన హోసూరు మున్సిపల్ కళా సాహిత్య హేతువాద పరిషత్తు నూతన కార్యవర్గం కృష్ణగిరి పశ్చిమ జిల్లా డీఎంకే కార్యదర్శి, ఎమ్మెల్యే వై ప్రకాశ్‌తో భేటీ అయ్యారు. హోసూరు మున్సిపల్ కార్యదర్శి మేయర్ సత్య, పశ్చిమ జిల్లా కౌన్సిల్ ఛైర్మెన్ యువరాజ్, కోశాధికారి, సుకుమార్, ప్రాంతీయ కార్యదర్శులు డిప్యూటీ మేయర్ ఆనందయ్య, వెంకటేశ్, రాము, తిమ్మరాజు ఉన్నారు. మున్సిపల్ కళా సాహితీవేత్త ఛైర్మెన్ సెందిల్ కుమార్, మున్సిపల్ కళా సాహిత్య పరిషత్ కార్యవర్గ అధ్యక్షులు సత్య, ఉపాధ్యక్షుడు శరవణన్, ఆర్గనైజర్ శేఖర్, డిప్యూటీ ఆర్గనైజర్లు గణేషన్, బసవరాజు, శీను, చంద్రు, మహ్మద్ నియాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో సాహిత్య హేతువాద పరిషత్ జట్టు సభ్యులు

ఘనంగా కనకదాస జయంతి



కనకదాస విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ తుకారం , మేయర్ నందీష్ తదితరులు



బళ్లారి నగరంలో కనకదాస చిత్రపటంతో ఊరేగింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి

బళ్లారి సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు విద్యాసంస్థల్లో , పార్టీ కార్యాలయాల్లో , వివిధ సంస్థల్లో దాస శ్రేష్ఠ కనకదాస 537వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు.

జేడీఎస్ పార్టీ కార్యాలయంలో

జేడీఎస్ పార్టీ కార్యాలయంలో కనక జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లాఅధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సాధారణంగా ప్రతి సంవత్సరం కార్తీక మాసం 18వ రోజున, 2008నుండి కర్ణాటక ప్రభుత్వం కనకదాస జయంతిని జరుపుకుంటుందన్నారు. ఆయన 537వ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నగర అధ్యక్షుడు హొన్నూర్‌స్వామి, హాజీ బాయ్,కిరణ్ కుమార్, జావీద్, అశోక్,బసవ,హొన్నూరు వలి, నాగవేణి,నీల ,షబానా, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సంజీవరాయన కోట పాఠశాలలో

ఆడంబరాల జీవితం కంటే సాదాసీదా నీతి జీవితం గొప్పదని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా అధ్యక్షుడు రవి చెళ్లగుర్కి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కనకదాసు,సంగొళ్ళిరాయన చిత్రపటాలకు నివాళులర్పించి ఆయన మాట్లాడారు. ఒక వ్యక్తి యొక్క బాహ్య ప్రవర్తన కంటే అంతర్గత ప్రవర్తన చాలా ముఖ్యమైనది ఎందుకంటే అదిసత్యతో నిండి ఉంటుందన్నారు. పంచాయితీ మాజీ సభ్యుడు దేవరాజు, తిమ్మనగౌడ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరశైవ మహావిద్యాలయంలో

నగరంలోని వీరశైవ మహావిద్యాలయంలో కనకదాస జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాలక మండలి ఛైర్మన్ దరూరు శాంతనగౌడ కనకదాసు చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. కనకదాసు మహానుబావుడని ఆయన జన్మించిన ఈ పుణ్యభూమిలో జీవించడం మనందరి అదృష్టమన్నారు. ప్రిన్సిపాల్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దాస సాహిత్యం అమోఘం : ఎమ్మెల్యే

భక్త శ్రేష్ఠ కనకదాస కీర్తనలు నేటికీ సామాన్యుల ఆదరణ పొందుతున్నాయని, అవి నీతి సాహిత్యానికి ప్రతీక అని సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాపాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో సోమవారం జరిగిన భక్త శ్రేష్ఠ కనకదాస జయంతి కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నగరంలో కనకదాస జయంతి సందర్భంగా శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కనకదాస సర్కిల్లోని కనకదాసు విగ్రహానికి ఎంపీ తుకారం పూలమాల వేసి నివాళర్పించి చిత్రపటానికి పూలమాలలు వేసి ఊరేగింపును ప్రారంభించారు. మేయర్ ముల్లంగి నందీశ్, ముండ్రగి నాగరాజు, గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు గాదిలింగన గౌడ, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బళ్లారిరూరల్ : భక్త కనకదాస జయంతి సందర్భంగా మాజీ మంత్రి శ్రీరాములు పాల్గొని కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కంప్లి : కంప్లి, కురుగోడు పట్టణాల్లో కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కంప్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆలుమత అధికారులు కనకదాస చిత్రపటానికి పూజలు నిర్వహించారు.

సిరుగుప్ప : కనకదాసు తత్వ సిద్ధాంతాలను పాటించాలని తహసీల్దార్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. సిరుగుప్ప పట్టణంలో తాలుకా పరిపాలనా, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భక్త కనకదాస జయంతి వేడుకలు జరిగాయి. హైస్కూలు గ్రౌండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భక్తకనకదాసు బావ చిత్రపటాన్ని ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. తహసీల్దార్ విశ్వనాథ్ ప్రారంభించారు.



జేడీఎస్ కార్యాలయంలో..



సంజీవనరాయన ప్రభుత్వ పాఠశాలలో



దేవలాపురంలో ఊరేగింపులో ఎమ్మెల్యే జేఎన్ గణేష్



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు శివరాజ్ పాటీల్, దద్దల బసనగౌడ

రాయచూరు : ప్రముఖ వాగ్గేయకారుడు భక్త కనకదాస 537వ జయంతిని నగరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంజ్ సర్కిల్‌లోని కనకదాస విగ్రహానికి జిల్లాధికారి నితీశ్, ఎమ్మెల్యేలు శివరాజ్ పాటీల్, దద్దల బసనగౌడలు హాజరై కనకదాస ఉత్సవ మూర్తి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా డోలు వాయించి నృత్యం చేసిన ఎమ్మెల్యేలు కనకదాస భక్తులకు ఉత్సాహాన్ని నింపారు. నగరంలోని ప్రధాన రహదారుల గుండా సాగిన కనకదాస ఊరేగింపు కార్యక్రమం నిర్వహించిన పండిత్ సిద్ధరామ్ జంబలదిన్ని రంగమందిరం వరకు సాగింది. అక్కడ నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో భక్త కనకదాస వాగ్గేయకారుడిగా సమాజానికి అందించిన సేవలను కొనియాడుతు పలువురు ప్రసంగించారు. అనంతరం కనకరత్న పేరున వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి బహుమతులను ప్రధానం చేసి సన్మానించారు.